# ది డెత్ ఆఫ్ లాస్ట్ ఇండియన్

జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం - ఎ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో రు. 5000/-ల నగదు బహుమతి పొందిన కథ**

"కూసుంటే లెగిచేదానికి రాదు..., లెగిస్తే నడిచేదానిక్కాదు! తింటే అరగదు..., తినకుంటే జరగదు! చేసినంత చేసినావు... చూసినంత చూసినావు! ఇంకా దేనికప్పా గూటం కొట్టుకుని కూసోనిండేది, అయినోళ్లందర్తోనూ అనిపించు కునేదానికా?'

"నీయమ్మ నాయాలా నా సావు..., నా ఇష్టం అడిగేదానికి నువ్వేదువాయ్?" అంటూ నారప్పని నాలుగంటుకునేదానికి చేతికట్టెని అందుకున్నాడు. చేతికట్టి ఊశన్న.

వెంటనే నారప్ప పక్కకి జరిగాడు. చేతికట్టె రెండో చివరని బిర్రుగా పట్టుకుని నవ్వుతూ చెప్పాడు నారప్ప, "ఆ మాటలు అడుగుతాండేది నేను కాదప్పా సామి..., ఉండాడుగా నీ మనవని కొడుకు, పాపోడు."

మునివనవడి పేరు వినపడగానే ఊశన్న కోపం గాలి కెగిరి పోయింది. వెంటనే "మా పాపోడు మా ఇష్టం, అంటే అన్నాడు గానీ వాడు ఎట్లా ఉండాడు! ఏం చేస్తాండాడు అది చెప్పు ముందు" అంటూ నారప్ప ముందు బుద్ధిమంతునిలా చెక్కాలు ముక్కాలు వేసుకుని కూర్చునాడు ఊశన్న.


'ఏంది చెప్పేది ఆ పొద్దే ఆ జాగా వాని పేర్న పెట్టమంటే పెట్టక పోతివి... పోనీ అమ్ముదా మంటే ఆ మాటా వినకపోతివి ఈ పొద్దేమాయె, నీకూ లేకపాయె, వానికీ కాకపాయె. మీ పాట్లు మీరు పడతాండంగానే అంతా గవర్నమెంటు పెరుక్కునేసె."

"ఆ జాగా పెరుక్కుంటే ఏమంట.. ఈ జాగా ఇచ్చింది కదా? వచ్చి ఉంటానంటే వద్దంటినా?"

"పాపోడు కూడా అదే చెప్పాండాడు... నాలుగూళ్లకి ఆ పక్క కంప చెట్ల జాగా ఉంటే ఎంత? లేకుంటే ఎంత? ఆయప్పని వచ్చి మాతోనే ఉండమని చెప్పు అంటూ చెప్పి అంపించినాడు."

ఆ మాట వినగానే ఊశన్న బోసినోరంతా నవ్వుతో నిండిపోయింది. "సూడప్పా. నీ యాట్లా నూరు మంది నూరు అనుకోనీలే జేజినాయన జేజినాయనే! మునిమనవడు మునిమనమడే."

"అంతేలేప్పా. అన్నోడూ మంచోడే! అనిపించుకున్నాడూ మంచోడే! నడుమ మంచి చెప్పినోడే చేటునాయాలు గానీ పద, పోదాం" అంటూ లేచాడు నారప్ప.



అతని సాయంతో ఊశన్న కూడా లేచాడు. చుట్టింట్లోకి వెళ్లి పెట్టి లోంచీ పట్టు పంచె, జుబ్బా తీశాడు. అయిదు నిముషాల్లో తయారై గాంధీ టోపీ పెట్టు కున్నాడు. భుజం మీద మూడు రంగుల ఖద్దరు ఉత్తరీయం వేసుకుని బయలుదేరాడు. నారప్పకి విషయం అర్థమై మారు మాట్లాడకుండా అనుసరించాడు.

ఆ రోజు ఊశన్న చేతుల మీదుగా స్థలప్రదానం, అనంతరం శంకు స్థాపన కార్యక్రమం ఏర్పాటు చేసింది తిరుపతి నగరపాలకసంస్థ. ప్రస్తుతం ఊశన్న బయలుదేరింది, ఆ కార్యక్రమానికే. చుట్టింటి నించి బయటికి వచ్చి ఎదురుగా ఉన్న భారతమ్మ విగ్రహం ముందు నిలబడి ఆ రోజు తనకి జరగబోతున్న సన్మానం గురించీ, దానికి హాజరవుతున్న పెద్దల గురించీ సంతోషంగా చెప్పాడు.

ఊశన్న ప్రవర్తన, నడవడికలు నారప్పకి ఎంత విచిత్రంగా కనిపిస్తాయో అంతే విశిష్టంగా అనిపిస్తాయి. అలా అనిపించినప్పుడల్లా 'ఎర్రి కాలం పెద్దాయనా, ఎర్రి చేష్టలూ' అనుకుంటాడు. అభిమానంతో కూడిన గౌరవంతో నవ్వుకుంటాడు.

000

ఊశన్న శతాధికవృద్ధుడైన స్వాతంత్ర్యసమరయోధుడు. గాంధీ మహాత్ముని వెంట వందేమాతరం అంటూ ఏడుకొండలూ ఎక్కినవాడు. అంత వరకూ అంటరానివారికి ఆలయప్రవేశం నిషిద్ధంగా ఉండేది. మహాత్ముని వెంట తొలిసారిగా ఆలయ ప్రవేశం చేశాడు. ఆ విధంగా మహాత్ముని చలువ వల్ల క్రమంగా నిషేధం తొలగించబడింది.

తిరుపతి కొండకి దోలీలు తగ్గింతరవాత పట్నంలో రిక్షా వెయ్యడం మొదలు పెట్టాడు. ఊశన్న రిక్షాకి ఒక ప్రత్యేకత ఉంది. అతని దృష్టిలో తెల్ల తోలు పిల్లి కళ్ల దొరలంతా ఆంగ్లేయులే. ఆంగ్లేయులంటే మన స్వాతంత్ర్యం కొల్లగొట్టినవాళ్లు. అందుకే తెల్లవాళ్లనీ టాస్ బూస్ ఇంగ్లీష్ మాట్లాడేవారినీ తన రిక్షాలో ఎక్కనివ్వడు. తన ఎదురుగా ఏ రిక్షావాడినీ ఎక్కించుకోనివ్వడు.

ఆంగ్లేయులంటే అతనికి అంతటి అలుక ఉండటం వెనుక ఓ బలమైన కారణం ఉంది.

అది స్వాతంత్ర్యోద్యమం మమ్మురంగా సాగుతున్న కాలం.

ఆసేతుశీతాచలం భారతీయు లందరి నోటా ఒకటే మాట... వందే మాతరం! సత్యశివసుందర స్వరూపమైన ఆ మాతృపంచాక్షరీమంత్రం శతసహస్రగళాల పల్లవిస్తూ జాతి గుండెల్లో ప్రతిధ్వనిస్తోంది.

అటువంటి కాలంలో...

అప్పటి మద్రాసు గవర్నర్ తిరుమలేశుని దర్శించి సేవించుకోవాలని సంకల్పించాడు. ఈ విషయం తిరుపతిలోని స్వాతంత్ర్యోద్యమకారులకి తెలిసింది.

ఆ గవర్నర్‌ని అలిపిరి దగ్గర అడ్డుకోవాలన్న తీర్మానం జరిగింది.

ఆ నాడు...

గవర్నరు వాహనం అలిపిరి వరకూ వచ్చింది.

అంతే...

చెట్ల లోంచీ పుట్ల లోంచీ చీమల బారుల్లా బయటికి వస్తున్నారు సత్యాగ్రహులు వందలు.. వేలాదిగా వచ్చి దారికడ్డుగా నిలబడి నినాదాలు చేస్తున్నారు.

ఉన్నట్లుండి ప్రత్యక్షమైన ఆ మహా జనసముద్రాన్ని చూసిన అధికారుల్లో ఆందోళన! సత్యాగ్రహుల్లో వెల్లువెత్తిన ఉత్సాహం. "వందేమాతరం... గవర్నర్ గో బ్యాక్...!" తమ నాయకుని వెంట ఉత్సాహంగా ముందు వరుసలోకి దూసుకు

వచ్చాడు ఊశన్న.

అతని వెనుక అతని భార్య భారతమ్మ.

వారి చుట్టూ దశదిశలా మార్మోగుతున్న నినాదాలు.

అంతలోనే ఎవరో అతివాది చేతి నించి వచ్చింది దూసుకువచ్చిందో పలుకురాయి. గవర్నర్ నుదుటి రక్తాన్ని రుచి చూసింది.

అంతే...గుంపుని చెదరగొట్టడానికి గాలిలోకి పేలింది తుపాకీ.

దానికి ప్రతిగా ఆ గాలిలోకి గుండు పేల్చిన సిపాయి మీద పేలిందొక అతివాది పిస్తోలు. అంత వరకూ ప్రశాంతంగా సాగిన ప్రతిఘటన ఫైరింగార్డరుతో రక్తసిక్తమైంది. సత్యాగ్రహుల్లో అలజడి.. ఆందోళన... అయినా చెక్కు చెదరని ఆత్మవిశ్వాసం!


ఎక్కడివారక్కడే నిలబడి "వందేమాతరం!" అంటూ దిక్కులు పిక్కటిల్లేలా ఘోషిస్తూనే ఉన్నారు. చూస్తూండగానే ఒక సత్యాగ్రహి భుజంలో తుపాకీ గుండు దిగబడింది.

అంతే.. నాయకుడు ముందు కురికాడు. "ధైర్యం ఉంటే నన్ను కాల్చండి!" అంటూ రొమ్ము ఎదురొడ్డాడు.

ఒక సిపాయి తుపాకీ అటు తిరిగింది.

దాన్ని గమనించిన భారతమ్మ అడ్డుపడింది.

ఆ గుండు నేరుగా ఆమె గుండెల్లో దిగబడింది.



ఊశన్న చేతుల్లో వాలిపోతూ భారతమ్మ...!

ఏ కన్నతల్లి పేగు తెంచుకుని పుట్టిందో గానీ నేలతల్లి చెర విడిపించే మహాయజ్ఞంలో పుట్టు తెంచుకుంది.

తన చేతుల్లోనే భార్య నిండు నూరేళ్లూ నింపుకోవడాన్ని సహించలేని ఊశన్న, ఆవేశంతో ఊగిపోయాడు. "వందే మాతరం... వందే మాతరం..." అంటూ నినదిస్తూనే చేతి కందిన రాళ్లనీ, జండా కర్రలనీ సిపాయిల మీదికి విసురుతూ ముందుకి వెళుతున్నాడు.

అలా వెళుతూండగానే ఓ తుపాకీ గుండు అతని భుజంలో దిగబడింది.

మరి కొద్ది క్షణాల్లో అతనికి స్పృహ తప్పింది.

తిరిగి తెలివి వచ్చి కళ్లు తెరిచేసరికి బందులదొడ్డి లాంటి జైలు ఆసుప్రతిలో చాప మీద ఉన్నాడు. కళ్లు తెరచి చూడగానే ఎదురుగా నాయకుడు.

ఆయన్ని చూడగానే గొల్లుమన్నాడు ఊశన్న.

దాని కతడిని ఊరడిస్తూ అన్నాడు నాయకుడు, "మనిషికి చావనేది తప్పేది కాదు. కానీ భారతమ్మలాగా దేశం కోసం ప్రాణాలిచ్చే అదృష్టం ఎంతో పుణ్యం చేసుకుంటే తప ్పరాదు. ఆ దేశభక్తురాలి అంత్యక్రియలు కూడా ఒక ఉద్యమంలాగా జరిగాయి."

మధ్యలోనే అడ్డు తగిలి, "అట్లా కాదప్పా!" అంటూ ఏదో చెప్పబోయాడు ఊశన్న.

అతను ఏం అడగబోతున్నాడో అర్థం చేసుకున్నవాడిలా అన్నాడు నాయకుడు, "దాని గురించి నువ్వేం బాధపడకు ఊశన్నా. అన్నీ మీ కులాచారం ప్రకారమే దగ్గరుండి మరీ జరిపించాను."

'కులాచారం' అనే మాట వినబడగానే, ఒక్కసారిగా బిగ్గరగా అరచి వెల్లకిలా విరుచుకుపడిపోయాడు ఊశన్న. ఆ వెనువెంటనే మళ్లీ స్పృహ తప్పింది.

అంత శ్రద్ధగా అన్నీ కులాచారం ప్రకారం తుచ తప్పకుండా జరిపించినందుకు ఆనందించాల్సింది పోయి, అలా ఎందుకు పడిపోయాడో అర్థం కాక ఆశ్చర్యంగా చూస్తూండిపోయాడు వారి నాయకుడు.

000

దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. తొలిసారిగా మూడు రంగుల జెండాని ఊశన్న చేతనే ఎగుర వేయించాడు నాయకుడు. అంతే కాదు, ఆ నాటి సమావేశంలో తిరుపతి నడి బొడ్డున భారతమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలన్న తీర్మానం కూడా ఆమోదించబడింది.

భారతమ్మ విగ్రహం తయారైంది.

అప్పటికే దేశం, దేశనాయకుల చేతుల్లోంచీ రాజకీయనాయకుల చేతుల్లోకి వచ్చేసింది. భారతమ్మ విగ్రహం నిలబెట్టాలనుకున్న స్థలంలో గాంధీమహాత్ముని విగ్రహం ప్రతిష్ఠించారు.

మహాత్ముని విగ్రహాన్ని ఊరూరా నెలకొల్పవలసిందే! పూజించవలసిందే! కానీ, దాని కోసం తిరుపతి పట్నంలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భారతమ్మకి స్థలం లేకుండా చెయ్యడం వారి నాయకుణ్ని ఎంతో బాధపెట్టింది. కానీ ఊశన్నకి మాత్రం సంతోషాన్ని కలిగించింది.

ఎందుకంటే... ఆ విగ్రహాన్ని పక్కన పెట్టడం వల్ల దాన్ని తీసుకువెళ్లి ప్రభుత్వం తన కిచ్చిన స్థలంలో వేసుకున్న గుడిసె ముందు నిలబెట్టుకున్నాడు. అతనికి ఆ విగ్రహంతో మాట్లాడుతూంటే స్వయంగా భారతమ్మతో మాట్లాడుతున్నట్లే ఉంటుంది.

ఆ విధంగా ఊళ్లో వర్ధిల్లవలసిన స్వాతంత్ర్యం, ఊశన్న స్థలంలోకి బదిలీ అయింది.

కాలం... కాలంతో పాటు మనుషులూ, వారి వేషభాషలూ... విలువలూ, ధర్మాలూ, మంచీ చెడుల విభజనరేఖలూ, నిత్య నీతుల నిర్వచనాలూ... ఇలా దేనికదే మారిపోతూంటే... ఆ మార్పు లన్నింటికీ మౌనసాక్షిగా భారతమ్మ విగ్రహం! దాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఊశన్న!!

ఇప్పుడు జెండా పండక్కి మాత్రం జనానికి దేశం గుర్తొస్తుంది. ఊళ్లో పెద్దలంతా చేరి ఊశన్న కోసం ఊరంతా గాలిస్తారు. తమ దేశభక్తిని ఎడాపెడా చాటుకున్నాక ఊశన్నతో జెండా ఎగరేయిస్తారు.

జెండా స్వేచ్ఛగా గాల్లో ఎగురుతుంది.

ఆ తరువాత మళ్లీ వచ్చే జనవరి ఇరవై ఆరుకే... మధ్యలో 'దేశం' పేరుకే!

000

ఊశన్న కళ్ల ముందే కూతురూ, అల్లుడూ కాలం చేశారు. అనారోగ్యంతో మనవడూ చనిపోయి, మునిమనవడు పాపోడి కాలం వచ్చింది.

పాపోడి అసలు పేరు కూడా ఊశన్న. మనిషి ఆశన్న!

ఊశన్న దేశభక్తిని గుర్తించి ప్రభుత్వం ఇచ్చిన స్థలానికి ఇవతల ఉన్న కొర్లగుంట చెరువు, బస్ టెర్మినస్‌గా మారింది. కొర్లగుంట పెద్ద బిజినెస్ సెంటర్ అయింది. ఊశన్న స్థలానికి ఇవతల వైపున అలిపిరి రోడ్డు మూడు వైపుల కాలనీలు.

కాలజ్ఞానంలో చెప్పినట్లు బీడు భూముల్లో నాట్లు వెయ్యకుండానే నోట్లు పండుతున్నాయి. అడుగు నేల అయిదొందలు దాటింది. అటువంటి చోట రెండెకరాల స్థలం అంటే మాటలు కాదు.

అందుకే ఆ స్థలాన్ని అమ్ముదామన్నాడు పాపోడు.

అమ్మితే ఆ డబ్బుతో కాస్త ఎడంగా మేడలు కట్టచ్చు. కార్లలో తిరగచ్చు. బిడ్డల్ని బంగారుగా చదివించుకోవచ్చు. కానీ ఆ జాగా నేను సంపాదించింది కాదు గనక నాకు అమ్మే అధికారం లేదంటాడు

ఊశన్న. అక్కడితో ఆగకుండా నా తిండికి నేను సంపాదించుకుంటూ గవర్నమెంటు ఇచ్చే స్వాతంత్ర్యసమరయోధుల పెన్షన్ అంతా నీకే ఇస్తున్నాను చాలదా అంటాడు.

అలా మొదలైన మనస్తాపాలు, తిట్లూ, శాపనార్థాలుగా మారి చివరకి పంతాలూ పట్టింపుల దాకా వచ్చాయి. దాంతో 'మళ్లా నీ ఇంట కాలు పెడితే మనిసిని కాదు' అంటూ బయటికి వచ్చేశాడు ఊశన్న. ఇంత జరిగినా పాపోడికి ఎంతో విలువైన ఆ స్థలం మీద ఆశ చావక పోవడంతో మొదలైంది అసలు కథ.

అప్పటికే ఊశన్న బాగా పండిపోయాడు. పండుటాకు రాలిపోవడం అత్యంతస్వాభావికం గనుక ఆయన ఎప్పుడు పోయినా, ఎక్కడ పోయినా, ఎలా పోయినా, ఎందుకు పోయాడని మాత్రం ఎవరూ అడగరు. ఒప్పించడం ఎలాగూ వల్ల కాలేదు గనుక తప్పించడమే మంచి దనుకున్నాడు, పాపోడు.

ఊశన్నకి చిన్నప్పటి నుంచీ మందు అలవాటుంది.

అలా దశాబ్దాల తరబడి నాటు-నీటు, కాపు-కల్లు లాంటి వర్ణవివక్ష లేకుండా ప్రజాస్వామ్యపద్ధతిలో దొరికిన మందల్లా దొరికినట్లు వాడే సద్గుణం వల్లే వయసు మీరినా ఎటువంటి అనారోగ్యం లేకుండా చలాకిగా తిరుగుతున్నా డన్నది తిరుపతి మందు బాబుల అచంచల విశ్వాసం. ఊశన్న అలా మందు మహారాజుగా రాజిల్లడం వెనుక ఓ బలమైన కారణం ఉంది. ఆయన మందు మత్తు లేకుండా పడుకుంటే ఓ భయంకరమైన పీడ కల వస్తుంది. ఆ కల గనక వస్తే కనీసం వారం- పది రోజులైనా పీడిస్తుంది. కలవరపెడుతుంది! భయపెడుతుంది! మందు తాగినా ఏ మాత్రం ఎక్కదు. ఆ కల నించీ తప్పించుకోవడానికే తాగుతాడు తప్ప తాగుడికి బానిసై మాత్రం కాదు.

**అందుకే వీధి రౌడీల్ని వెంటేసుకుని, వార్డు మెంబర్లూ, బజారు గుండాల్నీ, అక్రమవ్యాపారస్తుల్నీ వెంటేసుకుని ప్రతినాయకులూ, వందిమాగధగణాల్నీ, పోలీసులూ, అధికారుల్నీ వెంటేసుకుని మంత్రి వర్యులూ-ఇలా వారి వారి తాహతుల మేరకి బలప్రదర్శనలు చేస్తూ ఊశన్న భౌతికకాయానికి అంజలి ఘటించారు.**

అలాంటి తాగుబోతుని తప్పించడం అంత కష్టమైన పనేమీ కాదు. పాపోడికి కష్టమైన పనల్లా నారప్ప లేకుండా ఊశన్నని పట్టడం. ఆ తాడూ, బొంగరం లేనివాళ్లిద్దరూ, తాడూ, బొంగరం లాంటివాళ్లు. ఈ తాడుంటే తప్ప ఆ బొంగరం తిరగదు. పాపోడి అదృష్టం కొద్దీ నారప్ప ఊరెళ్లాడు. వారం వరకూ తిరిగి రాడు.

ఈ విషయం తెలియగానే ఓ మంచి రోజు చూసుకుని ఊశన్న చూడకుండా, ఆయన తాగే మందులో తను తెచ్చిన మందు కూడా కలిపేసి, తనదారిన తాను చక్కా పోయాడు పాపోడు.

అలవాటు ప్రకారం ఆ రాత్రి కూడా తీర్థానికి తయారయ్యాడు ఊశన్న. తాగుతూంటే రుచిలో తేడా వచ్చినట్లు అనిపించింది గానీ దాన్నంతగా పట్టించుకోలేదు ఊశన్న. ఎందుకంటే ఏం కలపకుండా ఒరిజినల్ మందుని ఒరిజినల్‌గానే అమ్మెయ్యడానికి తిరుపతి వైన్ షాపుల వాళ్లేం అమాయకులు కారని ఆయనకి తెలుసు.

ఆ ప్రకారంగా ఆ రాత్రికి కల్తీ మందులో కడుపు నింపుకున్నాడు ఊశన్న. తాగడం పూర్తయ్యాక ఎప్పుడూ లేనిది కడుపులో మంటనిపించింది. మరి కాసేపట్లో ప్లేగుల్లో మరగ˘కాచిన నూనె ప్రవహిస్తున్నట్లు భగ్గుమంది కడుపు.

మర్నాడు అందరికీ తెల్లవారింది...!

ఊశన్న బతుకు మాత్రం తెల్లవారిపోయింది...!!

పాపోడు గొల్లుమంటూ ఆనందంగా పొర్లిపొర్లి ఏడుస్తున్నాడు.

ఈ లోగా ఊశన్న మరణవార్త ఊరంతా తెలిసిపోయింది.

ఊశన్న చనిపోవడం అంటే మామూలు విషయం కాదు. బోలెడంత ప్రచారం దొరికే అరుదైన అవకాశం. ఆయనంటే సామాన్యుడు కాదు, వయోవృద్ధుడు! దేశభక్తుడు! స్వాతంత్ర్యసమరయోధుడు! అలాంటి పెద్దమనిషి చనిపోయాడంటే ఘనంగా నివాళులర్పించి పేపర్లలో పెద్ద పెద్ద ఫోటోలు వేయించోవచ్చు. ఆయన నిరాడంబరత్వాన్ని గురించి ఆడంబరంగా ఉపన్యాసాలిచ్చుకోవచ్చు. సంతాపసభలూ, మౌనంగా ఊరేగింపులూ, గట్రా చేసుకుని బోలెడు ప్రచారం పొందవచ్చు.

అందుకే వీధి రౌడీల్ని వెంటేసుకుని, వార్డు మెంబర్లూ, బజారు గుండాల్నీ, అక్రమవ్యాపారస్తుల్నీ వెంటేసుకుని ప్రతినాయకులూ, వందిమాగధగణాల్నీ, పోలీసులూ, అధికారుల్నీ వెంటేసుకుని మంత్రి వర్యులూ-ఇలా వారి వారి తాహతుల మేరకి బలప్రదర్శనలు చేస్తూ ఊశన్న భౌతికకాయానికి అంజలి ఘటించారు.

ప్రజలు గుంపులుగుంపులుగా చేరుకున్నారు.

ఇవన్నీ ఉండాలే గానీ ప్రసారమాధ్యమాల వాళ్లకి పండగే పండగ!

పాపోడికి చాలా ఆనందంగా ఉంది. ఆ స్థలాల్ని అమ్మి లక్షాధికారి కావచ్చు.

కాబోయే లక్షాధికారి గనక ముత్తాత అంత్యక్రియలు ఘనంగా జరిపించడానికి అప్పులు చేసి మరీ అందర్నీ రప్పించాడు. అన్నీ సమకూర్చాడు.

శవయాత్రకి ముందు డప్పులు... వాటి ముందు డాన్సులు...వాళ్లకి సారాయి.

పాడి వెనుక మేళం... మేళగాళ్లకి సీమ సరుకు.

ఆ మేళగాళ్లకి ముందు మంత్రగాళ్లు... వాళ్లు చదివే మంత్రాలకి సంభావనలూ దశదానాలూ...

ఊశన్న పాడె పైకి లేచింది. అంతిమయాత్ర ఆర్భాటంగా ఆరంభమైంది.

రెండు దింపుడు కళ్లాల దగ్గరా భుజాలు మార్చుకుని మూడో దింపుడు కళ్లం కోసం పాడిని దించబోతూంటే, "దింపుడు కళ్లం ఆశలు పెట్టుకునే దానికి ఊశన్నేమైనా వయసు పిల్లోడా? ఎత్తుకోండి ఎత్తుకోండి!" అన్నాడు ఓ పెద్దమనిషి.

'లేదు పెద్దాయనా... ఆ యనప్పకి అన్నీ పద్ధతిగా జరిపించాల' అన్నాడు పాపోడు.

నాలుగో దింపుడు కళ్లం దగ్గర అదే పెద్దమనిషి అడిగాడు, "అన్నీ పద్ధతిగానే జరగాలంటివి... ఇప్పుడు మనం పొయ్యేది కాట్లోకా? అడవిలోకా?"

"కాట్లో ఏం పని? అడవిలోనే... ఎవురెట్లా పోయినా మనం మాత్రం మన కులాచారం ఇడిచిపెట్టేది లేదు" అని తెగేసి మరీ చెప్పాడు పాపోడు.

ఈ మాటలు ఊశన్న చెవిన పడ్డాయి.

అంతే... ఒక్కసారిగా కట్లు తెంపుకుని లేస్తూ అరిచాడు, "నీయమ్మ నాయాండ్లాలా! నేను ఏ సావయినా సస్తా గానీ కులం సావు మాత్రం సచ్చినా సావను!" అంటూ.

అంత వరకూ "నారాయణా. గోవిందా" అంటూ ఊశన్న ఆత్మశాంతి కోసం ప్రార్థించిన వారంతా, ప్రాణాలు అరచేత పట్టుకుని "రాముడా దేవుడా బతుకు జీవుడా" అనుకుంటూ పరుగందుకున్నారు.

కులం సావు వద్దనుకుంటే ఆ మాట ముందే చెప్పుండాల్సింది. అయిన అప్పులన్నీ చేసి ఇంత వరకూ జరిపాక ఇప్పటికప్పుడు లేచి ఈ చావు మాత్రం చావనని తిరగబడేసరికి... పాపం పాపోడికి ఏ చావు చావాలో పాలుపోని పరిస్థితి!

**000**

ఊశన్నకి చావంటే భయం. అందులోనూ తమ కులం చావంటే మరీ భయం ఆ భయం వెనుక అలివి కాని ఆవేదన ఉంది. గుండె పగిలేంతటి దుఃఖం ఉంది.

వారి కులాచారం ప్రకారం...శవాన్ని దహనం గానీ ఖననం గానీ చెయ్యరు. శవాన్ని ఊరవతలి వరకూ మేళతాళాలతో ఊరేగిస్తారు. అక్కడి నించీ అడివి దాకా నిశ్శబ్దంగా తీసుకువెళతారు. శవాన్ని ఓ చెట్టు కింద దించుతారు. ఆ తర్వాత అలంకరణలూ, ఆభరణాలూ తీసేసి... ఉత్త బిత్తలగా వదిలేసి వెనక్కి తిరిగి చూడకుండా వచ్చేస్తారు.

అనంతరం ఆ శవాన్ని అడివి జంతువులు పీక్కు తింటాయి.

బ్రతికి ఉండగా ఎవరికీ ఏ విధంగానూ ఉపయోగించని నవరంధ్రాల నీటి బుడగ ...కనీసం చనిపోయాకైనా కొన్ని ప్రాణులకి ఆహారంగా అందాలన్నదే ఆ ఆచారం వెనుక వున్న ఆంతర్యం.

అప్పటికి ఊశన్న వయసు పదేళ్లు.

అతని తల్లి అనాగోర్యంతో మరణించింది.

అతని చేత చేయించవలసిన కర్మలన్నీ చేయించారు.

అంతా అయిన తరవాత అతన్ని ఇంటి దగ్గర వదిలేసి బయలుదేరారు. అయినా అతను వస్తానని ఏడుస్తూంటే గుడిసెలో పెట్టి బయట చిలుకు పెట్టి వెళ్లి పోయారు. ఊశన్న ఏడ్చినంత సేపూ ఏడ్చి గుడిసె లోంచీ బయటపడే దారి కోసం వెతికాడు.

వైనుక వైపు వదులుగా వున్న తడిక సందు లోంచీ బయట పడ్డాడు. అడవిలోకి పరుగు పెట్టాడు. శవయాత్ర కనుచూపు మేరలోకి వచ్చిన తరవాత వారిని దూరం నించే వెంబడించాడు.

శవాన్ని చెట్టు కింద దించడం... పసుపుకుంకాలు పూయడం... పాదాభివందనాలు చేయడం... అన్నీ దూరంగా చెట్టు చాటు నించీ గమనిస్తున్న ఊశన్నలో దుఃఖం...

అందరూ వెళ్లిపోయేవరకు నోటికి చేతులడ్డం పెట్టి ఏడుపుని అదుపు చేసుకున్నాడు. ఆ తరవాత పరిగెత్తు కుంటూ వెళ్లి తల్లిని పలకరించాడు... ఆమె పలకనందుకు ఆమెపై అలిగాడు. కోపగించు కున్నాడు.. అయినా ఆమె కదల్లేదు.

దాంతో ఉక్రోషం పట్టలేక ఆమెని తట్టి... కొట్టి లేపే ప్రయత్నం చేశాడు. అయినా చలనం లేదు.

అతనలా ఒంటరిగా తల్లి శవం మీద పడి రోదిస్తూండగా తల మీద ఏదో పొడిచిన ట్లనిపించింది తలపై కెత్తి చూస్తే.... అదొక గద్ద.

భయంతో ఒక్కసారిగా అరిచి పైకి లేచి పరుగందుకున్నాడు ఊశన్న.

అతను మరొక్క క్షణం ఆలస్యం చేసి వుంటే అతని కనుగుడ్లని పొడిచేసి వుండేది. అలా పరిగెత్తినంత దూరం పరిగెత్తి, ఓ చెట్టు చాటున నిలబడ్డాడు.

అదురుతున్న గుండెను అదిమి పట్టుకుని ధైర్యం చేసి వెనక్కి చూశాడు.

రాబందులు... వికృతంగా రెక్కలు కొట్టుకుంటూ... వికారంగా అరుస్తూ.... పొడుచుకు తింటున్నాయి.

భతావహమైన ఆ భయానకబీభత్సదృశ్యం ఊశన్న చిన్నారి హృదయంలో లోహముద్రల్ని గుద్దీ గుద్దీ ఛిద్రం చేసింది.

"అమ్మా... అమ్మా... అమ్మా...!" భయం... ప్రాణానికి ప్రాణమైన అమ్మంటే భయం... అమ్మ ఆఖరి చూపుని తలుచుకోవాలంటే భయం... అమ్మనలా కాకులకీ, గద్దలకీ వేసిన కులం చావంటే భయం... కళ్లు మూసుకుంటే కులం చావు కల్లోకి వస్తుంది. దాన్నించీ తప్పించుకోవడానికే మందు... మత్తు...

సరిగ్గా అయితే నిముషాలు... గద్దల్ని తరిమిన రాబందులు ఎంత వేగంగా చుట్టు ముట్టాయో, అంతే వేగంగా మాయమైపోయాయి. అంత వరకూ కాసుకు కూర్చున్న తోడేళ్లూ, నక్కలూ ఒక్కసారిగా చుట్టు ముట్టాయి. అంతలోనే వాసన పట్టిన దుమ్ములగొండి నవ్వు వినిపించింది... చెట్టు చాటున ఊశన్న ఆపాదమస్తకం వణికిపోతున్నాడు.

"అమ్మా... అమ్మా... అమ్మా...!"

భయం... ప్రాణానికి ప్రాణమైన అమ్మంటే భయం... అమ్మ ఆఖరి చూపుని తలుచుకోవాలంటే భయం... అమ్మనలా కాకులకీ, గద్దలకీ వేసిన కులం చావంటే భయం... కళ్లు మూసుకుంటే కులం చావు కల్లోకి వస్తుంది. దాన్నించీ తప్పించుకోవడానికే మందు... మత్తు... అయినా అడపాదడపా ఆ మత్తుని వదలగొడుతూ భయం... చావు భయం!

తుపాకీ గుండు తగిలి స్పృహ కోల్పోతూండగా అతనికి అనిపించిం దొక్కటే... భారతమ్మని మాత్రం కులం చావుకి బలి చెయ్యకూడదని.

పాపం, భారతమ్మనీ ఆ చావు వదల్లేదు! దాంతో ఊశన్నలో చావు భయం, చావు కంటె భయంకరంగా పెరిగిపోయింది.

ఈ ఊశన్న చావు భయం గురించి ఎంత మాత్రం తెలియని సాపోడు, అనవసరంగా హెచ్చులకి పోయి కులాచారం మాట గుర్తు చేసి శవాన్ని కూడా లేపి కూర్చోబెట్టాడు.

అంత వరకూ ఊశన్న మరణవార్తని రంగురంగుల పతాకశీర్షికలకి సిద్ధం చేసుకున్న విలేకరులంతా, ఊశన్న లేచి కూర్చోవడంతో రాసిందాన్నే తిరగరాయడం మొదలుపెట్టారు. ఆ విధంగా రాష్ట్ర మంతటా 'ఊశన్న సావు' గురించే వేడివేడి పకోడీల్లాంటి చర్చోప చర్చలు... పరిశీలనలు... పరిశోధనలూ... చచ్చి బతికినవాళ్ల చరిత్రలూ... ఈ విధంగా ఓ వారం రోజులపాటు ఎవరి దారిన వారుగా రెచ్చిపోయారు... ఆ తరువాత అంతా మామూలే... ఒక్కరు తప్ప!

ఆ ఒక్కడూ పాపం, సాపోడు!

000

ఒకసారి చచ్చి బతికిన తరువాత ఊశన్నకి ఓ అనుమానం వచ్చింది. మనిషన్నాంక పుట్టాల్సిందే... పుట్టినందుకు సావాల్సిందే!

ఆ సావు కులం సావు కాకుంటే, అదే పదివేలు.

ఈ కులం సావు తప్పించుకోవడం ఎలా? ఆలోచించగా ఆలోచించగా, తను చనిపోయిన తరవాత శవాన్ని దహనం చేస్తే ఏ గొడవా ఉండదనుకున్నాడు.

ఓ మంచి రోజు చూసుకుని నారప్పనీ, సాపోడినీ కూర్చోబెట్టుకుని ఈ సారి గనక తను చనిపోతే కులాచారం ప్రకారం కాకుండా అగ్నిసంస్కారం జరిపించమమని కోరుకున్నాడు. దానికి సంబంధించిన ఆచారవ్యవహారాల గురించి తెలుసుకొమ్మని సాపోడికి చెప్పాడు.

భారం పూర్తిగా సాపోడు, నారప్పలకి మాత్రమే వదిలెయ్యకుండా తన ప్రయత్నాలేవో తనూ చేసుకోవడం మొదలుపెట్టాడు.

అగ్నిసంస్కారానికి అన్నింటి కంటె ముందు కావలసినవి కట్టెలు. ఆ కట్టెలు బాగా కాలా లంటే గబ్బు సమురు పొయ్యాలి. అది ముందే గబ్బు సమురు... ఊరు ఊరంతా గబ్బు లేచి పోతుంది. అందుకే గబ్బు సమురు బదులుగా వాడటానికి ఆవు నెయ్యి సేకరించడం మొదలు పెట్టాడు. కట్టెల మధ్యలో సుగంధానికి ఊదు బత్తీలు వాడితే ఆ పరిమళం ఇలా వచ్చి అలా గాల్లో తేలిపోతుంది. అందుకే డబ్బున్నప్పుడల్లా గంధం బొమ్మలు కొనిపెట్టుకునేవాడు. మైసూరు నించీ పాత గిరాకీలు ఎవరొచ్చినా వాళ్లతో చందనతైలం, కర్పూరం ఉండలు తెప్పించుకునేవాడు.

ఇప్పుడు ఊశన్న అగ్నిసంస్కారానికి అంత శ్రద్ధగా అన్నీ సమకూర్చుకోవడాన్ని గమనించిన రియల్ ఎస్టేట్ వాళ్లు, అడుగు నేల అయిదొందలకి పెంచేశారు. అంత రేటు పెంచిన తరువాత కూడా ఊశన్నని ఊరికే వదిలేస్తే సాపోడి పని పాటిమట్టే!

అందుకే సాపోడు, తన కొడుకు పుట్టిన రోజు వంకన పాయసం తెచ్చిపెట్టాడు. అందులో కలపాల్సింది కలిపాడు. అది చెయ్యాల్సిన పని చేసింది. పదే పది నిమిషాల్లో జరగాల్సింది జరిగిపోయింది.

ఊశన్న విజయవంతంగా మళ్లీ పరమపదించాడు.

ఈ సారి అనవసరంగా హంగులూ ఆర్భాటాలకు పోకుండా నిరాడంబరంగా అంతిమయాత్ర జరపాలనుకున్నాడు సాపోడు. అయినా సరే అభిమానం ఉన్నవాళ్లు ఊశన్నకి స్వచ్ఛందంగా నివాళు లర్పించారు. ఊరేగింపులో పాల్గొన్నారు.

సాపోడికి ఊశన్న పోయిన ఆనందం కంటె పాడె ఎక్కిన దాకా వుండి ఎక్కడ లేచి కూర్చుంటాడో అన్న భయమే ఎక్కువగా ఉంది. పాడె లేచింది.

ప్రతి దింపుడు కళ్లం దగ్గరా సాపోడి గుండెదడ ఎక్కువ అవుతూనే ఉంది. నాలుగో దింపుడు కళ్లంలో కూడా ఊశన్న కదల్లేదు. దాంతో సాపోడు తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

పాడె మీంచి చితి మీదకి మారాడు ఊశన్న. చితి నిండా గంధపు బొమ్మలూ, కర్పూరం ఉండలూ, మైసూరు చందన తైలం..

ఆ చితి చుట్టూ కుండ ప్రదక్షిణలు చేస్తున్న సాపోడిలో పరమానందం. ఒక్కో ప్రదక్షిణానికీ ఒక్కో రంధ్రం చొప్పున పడుతూంటే అతని కళ్ల ముందు

కాళ్లకి లక్షలు కట్టుకుని చెంగుచెంగున గంతులేస్తున్న లక్ష్మీదేవమ్మ కనిపిస్తోంది. ఆయన అప్పుడే చనిపోయివుంటే 'అంతే' వచ్చేది. అదే అయిదేళ్లు ఆలస్యం చేసినందువల్ల ఇప్పుడు అంతకి నాలుగింతలు వస్తుంది. ప్రదక్షిణాలు పూర్తి చేసి కుండ బద్దలు కొడుతున్న పాపోడిలో సంతోషం లోపల నించీ ఎదగదన్ను కొచ్చేస్తోంది.

ఆ సంతోషాన్ని పళ్ల మధ్యన బిగబట్టి ముఖం బాధగా పెట్టి చితికి నిప్పు పెట్టాడు.

అది బాగా మండటానికి ఆవు నెయ్యి పోశాడు వెట్టివాడు... ఒక్కసారిగా భగ్గుమంది.

అంతే... చితి మీంచీ దబ్బున కింద పడ్డాడు ఊశన్న. పడ్డ వెంటనే పక్కకి దొర్లాడు. "నీయమ్మ నాయాండ్లలాలా! ఏ సావైనా సస్తాగానీ ఈ సావు మాత్రం సచ్చినా సావను!" అంటూ లేచి కూర్చున్నాడు.

దాన్ని చూసిన పాపోడికి కడుపు రగిలిపోయింది. "అప్పుడైతే కులం సావు సావనంటివి. ఇప్పుడేం భింగిరోగం వచ్చిందంటా లెగిచి కూర్చుండేదానికి?" అని కోపగించుకున్నాడు.

దానికి ఊశన్న, "కొరివి పెట్టేదానికి కొడుకు ల్లేకుండా సస్తే నరకానికి పోతారంటప్పా... తెలిసితెలిసీ నరకానికి పోయే సావు మనకి దేనికి లేప్పా? ఈసారి కిట్టా కానీ... వచ్చే సారయినా సక్రమంగా పోతే సరిపాయె" అంటూ చుట్టింటి దావ పట్టాడు.

000

అనంతరకాలంలో తిరుపతి పట్టణం నగరంగా అభివృద్ధి చెందింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరెక్కింది. ఇళ్ల స్థలాలకి రెక్కలొచ్చి ఆకాశంలో ఎగురుతున్నాయి రేట్లు. దాంతో, ఊశన్న స్థలం మీద కన్నేసిన ఓ రియల్ ఎస్టేటు వ్యాపారితో బేరం కుదుర్చుకున్నాడు పాపోడు.

ఓ శుభదినాన ఊశన్న కత్తి పోట్లకి గురై మరణించాడు.

ఊశన్న కోరిక ప్రకారమే ఆయన శవాన్ని ఖననం చెయ్యడానికి ఏర్పాట్లు చేశాడు పాపోడు.

ఏ మాత్రం ఏమారకుండా పద్ధతిగా ఊశన్న శవాన్ని గుంతలోకి దించాడు.

పద్ధతి ప్రకారం పాపోడు గుప్పెడు మట్టి తీసి వెయ్యగానే ఠక్కున లేచి కూర్చుని, "ఏ సావైనా సస్తా గానీ ఈ సావు మాత్రం సచ్చినా సావను!" అని ప్రకటించాడు.

"అన్నీ నువు కోరినట్లే జరిపించినా... దానాలూ, ధర్మాలూ చేపిస్తా వుండా... ఇన్నీ చేసినా మళ్లా లెగిసి కూసుంటే ఎట్లాగప్పా నీతో ఏగి సచ్చేది?" అంటూ కన్నీళ్ల పర్యంతమయ్యాడు పాపోడు.

'నువ్వు దానాలూ, ధర్మాలూ చేస్తాండావని... నన్నీ మంట్లో పురుగులు పడి సావమంటావంట్రా ముండనాయాలా?" అంటూ తిన్నగా గుంత లోంచీ పైకి వచ్చేశాడు ఊశన్న.

ఆ తరువాత పాపోడు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఊశన్న మాత్రం చావలేదు.

000

కాలం మారింది... రాజకీయం మారింది... ప్రభుత్వం మారింది...హైదరాబాదంతా రియల్ ఎస్టేటు వ్యాపారంలో రాటు దేలిన ప్రభుత్వం అటు కర్ణాటక, ఇటు తమిళనాడులకి కూతవేటు దూరంలో ఉన్న తిరుపతి మీద కన్నేసింది. ముందు జాగ్రత్త చర్యగా స్థలసేకరణకార్యక్రమం ప్రారంభించింది.

అమాయకుల స్థలానికి నామ్ కే వాస్తే నష్టపరిహారాన్నిచ్చి స్వాధీనం చేసుకుంది.

పనిలో పనిగా కోట్లాది రూపాయల విలువ చేసే ఊశన్న స్థలానికి బదులుగా రేణిగుంట అవతల-అడవికి ఇవతల కొంత స్థలాన్నిచ్చి తోడుగా బీడీ ఖర్చులకి సరిపోయేంత నష్టపరిహారం కూడా చేతిలో పెట్టి... చేతులు దులిపేసుకుంది.

ప్రభుత్వం ఇచ్చిన డబ్బుని పాపోడి కిచ్చేసి కొత్తగా కేటాయించిన స్థలంలో కొత్త గుడిసె కుట్టుకున్నాడు ఊశన్న. దాని ముందు భారతమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించుకున్నాడు.

ఇప్పుడు ఊశన్నకి ఆ స్థలం లేదు. ఉన్న స్థలం వల్ల ఉపయోగం లేదు. అందువల్ల పాపోడికి ఊశన్న మరణం వల్ల లాభం గానీ, జీవించడం వల్ల నష్టం గానీ లేదు. దాంతో ఆయన చావు గురించి బొత్తిగా పట్టించుకోవడం మానేశాడు.

పాపోడు పట్టించుకోనంత మాత్రాన ఊశన్న ఊరికే ఉండిపోగలడా?

అందుకే తన సమాధి పనులేవో తనే చూసుకోవడం మొదలు పెట్టాడు. లోతైన గొయ్యి తవ్వాడు, అందులోకి పురుగులూ, పుట్రా ప్రవేశించకుండా నాలుగు వరసల నాపరాయి పరిపించుకున్నాడు. నారప్పతో కలిసి ఊరంతా తిరిగి అందమైన లతలూ, పూలూ, బొమ్మలూ చెక్కిన రాళ్లని సేకరించడం మొదలుపెట్టాడు. ఒక దాంట్లో ఒకటి పట్టేట్లుగా నాలుగు శవపేటికల్ని చేయించుకుని లోపలి పేటికలో మెత్తగా ఉండటానికి పరుపులు పరిపించుకున్నాడు.

అతని సమాధి అంతా రంగు రాళ్లతోనూ, అత్తర్లు, సెంట్లు, సాంబ్రాణి కడ్డీలతోనూ నిండి పోయింది గానీ అతనికి మాత్రం చావు రాలేదు.

000

ఊశన్న స్థలంలో ఎత్తయిన వేదిక. ఆ వేదిక నిండా గాంధీలు. రాహుల్‌గాంధీ... సోనియాగాంధీ... రాజీవ్‌గాంధీ... ఇందిరాగాంధీ ఇంత మంది గాంధీలున్నా తన వెంట తిరుమల కొండెక్కిన గాంధీ మాత్రం లేడు గాక లేడు.

అక్కడ గాంధీ ఉన్నది ఊశన్న గుండె మీదున్న బ్యాడ్జీలో మాత్రమే! దాన్నోసారి కళ్ల కద్దుకుని వేదికనెక్కాడు ఊశన్న.

ఆ వేదిక ఎదురుగా ఇసక వేస్తే రాలనంత జనం. డబ్బులిచ్చిమరీ లారీల్లో తోలుకొచ్చారు.

ఆ బహిరంగసభలో ఊశన్న పేరు చెప్పి ప్రభుత్వం దేశభక్తిని ఎడాపెడా పొగిడి పాకం పెడుతున్న కేంద్రమంత్రి...

ఆ స్థలంలో కంపెనీ ప్రారంభం అయితే అందులో వేలాదిమందికి ఉద్యోగాలు...లక్షలాది మందికి ఉపాధి... ఆ కంపెనీ అవసరాలను కనిపెట్టి దాని అభివృద్ధికి పాటు బడితే మరిన్ని కంపెనీలు ఆకర్షింపబడతాయి. మరిన్ని మల్టీ-నేషనల్ కంపెనీలు..మరిన్ని విదేశీ పెట్టుబడులు... మరిన్ని అవకాశాలు... మరింత అభివృద్ధి.. మరిన్ని ఉద్యోగాలు... ఇలా ఆ మంత్రిగారు మరింత మరింతగా ప్రసంగిస్తూంటే... ఊశన్న మరింత మరింతగా పొంగిపోతున్నాడు.

మరింత మరింతగా ఆశ్చర్యపోతున్నాడు నారప్ప. తను ఇన్నాళ్లూ ఆ స్థలాన్ని పాపోడికి ఇవ్వనందుకు ఊశన్నంటే కోపంగా ఉండేవాడు. ఇప్పుడు మాత్రం గర్వపడుతున్నాడు. ఆ స్థలం పాపోడి కిచ్చివుంటే వాడు, వాడి కుంటుంబం మాత్రం బాగుపడి వుండేవారు. మరిప్పుడు? అదే స్థలం ఎంతో మందికి ఎన్నో విధాలుగా ఉపయోగిస్తోంది. మంత్రివర్యుల ప్రసంగం పూర్తయింది.

ఊశన్నని ముందుకు తీసుకువచ్చి నుంచోబెట్టారు. ఆయన చేతుల్లో ఏవో పత్రాలని ఉంచారు. వాటిని అందుకోవడానికి వస్తున్నాడు ఆ మల్టీ-నేషనల్ కంపెనీ ప్రతినిధి. ఆయన వస్తూంటే వారి కంపెనీ గ్రేట్ బ్రిటన్‌లో సాధించిన విజయాలని గురించీ బ్రిటిష్ కరెన్సీ విలువ, విశిష్టతల గురించీ వారి తెలివితేటల గురించీ నాయకులు వివరిస్తూంటే...

ఆ తెల్లతోలు... ఆ పిల్లి...కళ్లు... ఆ రాగిజుత్తు...

వేదిక మీద మైకు లందుకుని టాస్ బూస్... హూడ్ డాడ్..అంటూ ఎంగిలి కూతలు కూస్తూ ఉంటే...

ఊశన్న చెవుల్లో సీసం కరిగించిపోస్తున్నట్లు... కళ్లు బైర్లు కమ్ముతున్నట్లు... కాళ్లూ చేతులూ స్వాధీనం తప్పుతున్నట్లు...

ఇదే తెల్లోడిని ఎదిరించినందుకు..

ఏ ప్రభుత్వం తను అడక్కుండానే ఈ స్థలా న్నినిచ్చిందో... అదే ప్రభుత్వం అదే తెల్లోడికి... అదే స్థలాన్ని ఇమ్మని కాయితాలు చేత బెడితే...

ఏం చెయ్యాలో అర్థం కాని ఊశన్న మెదడు మొద్దుబారిపోతూ వుంటే...

సర్వశక్తుల్నీ కూడదీసుకుంటూ అరిచాడు "నేను ఏ సావయినా సస్తా గానీ నీయమ్మ నాయాండ్లలాలా! ఈ సావు మాత్రం సచ్చినా సావన్రారేయ్...!" ●

కాలం మారింది... రాజకీయం మారింది... ప్రభుత్వం మారింది... హైదరాబాదంతా రియల్ ఎస్టేటు వ్యాపారంలో రాటు దేలిన ప్రభుత్వం అటు కర్ణాటక, ఇటు తమిళనాడులకి కూతవేటు దూరంలో ఉన్న తిరుపతి మీద కన్నేసింది. ముందు జాగ్రత్త చర్యగా స్థలసేకరణకార్యక్రమం ప్రారంభించింది. అమాయకుల స్థలానికి నామ్ కే వాస్తే నష్టపరిహారాన్నిచ్చి స్వాధీనం చేసుకుంది.